# సిటీ ట్రాఫిక్

రామానుజం భయం భయంగా ఆఫీసరు స్వామినాథం గదిలోకి అడుగుపెట్టాడు.

"పిల్చారా సార్?" అన్నాడు గుటకలు మింగుతూ.

"అవును! .. ఇప్పుడు టైమెంతయ్యింది? ఆ?" హుంకరిస్తూ అడిగాడు స్వామినాథం.

"పదిన్నర సార్!" మళ్ళీ గుటకలు మింగాడు రామానుజం.

"ఆఫీసు ఎన్ని గంటలకి?"

"పది గంటలకి సార్!...."

"మరి అరగంట లేటుగా ఎందుకొచ్చావ్?" పళ్ళు కొరుకుతూ అడిగాడు స్వామినాథం.

"మా ఇల్లు ఇక్కడికి చాలా దూరం సార్....అప్పటికీ ఇంటి నుండి త్వరగానే బయలుదేరాను సార్...." గుటకలు మింగాడు రామానుజం.

"అంటే రోజూ ఇల్లు దూరంగా ఉందని లేటుగా వస్తావా!" పళ్ళు పటపటా కొరికాడు స్వామినాథం.

"హబ్బే ...త్వరగానే వస్తానండి....మరేమో సిటీ బస్సులు దొరక్క అవస్థపడుతున్నానండి—రేపట్నొండి ఇంటినుండి త్వరగా బయల్దేరాలెండి—" అన్నాడు రామానుజం గుటకలు మింగుతూ.

"ఊ....సరే అదీ చూద్దాం....రేపట్నుంచి ఆలశ్యంగా వస్తే వూరుకోను .. అది సరేగానీ ఏంటి ఇందాకట్నుండి తెగమింగుతున్నావ్.. మింగడానికి ఓ టైమూపాడూ లేదా?" పళ్ళు పటపటలాడించాడు స్వామినాథం.

రామానుజం కిసుక్కున నవ్వాడు. మీరు పొరబాటు పడ్డారుసార్

నేను ఏమి తినడం లేదు .. మీరంటే ఉన్న భయం భక్తివల్ల గుటకలు మింగాను అంతే .. హి"

"ఊ .. ఊ .. సర్లే .. ఏం మింగినా లంచ్ టైంలోనే మింగాలి తెల్సిందా?" అంటూ నవ్వాడు.

స్వామినాథం మొహంలో నవ్వు చూడగానే రామానుజంకి ధైర్యం వచ్చింది.

"అట్టాగేసార్ .. మరేమో నాక్కొన్ని బఠానీలు ఇవ్వరా? బఠానీలంటే నాకు చాలా ఇష్టం .. లంచ్ టైంలోనే తింటాను లెండి .. హి .." అన్నాడు మెలికలు తిరిగుతూ.

స్వామినాథం ఆశ్చర్యంగా చూశాడు.

"బఠానీలా! నా దగ్గరెక్కడున్నాయ్!"

"ఇందాకట్నుండి ఫటాఫటా నములుతున్నారుగా .. మీరైతే ఆఫీసర్లు .. ఎప్పుడైనా నమలొచ్చు. మేమైతే లంచ్ టైంలోనే నమలాలి! హి .. నాక్కొన్ని బఠానీలు ఇవ్వరా సార్ ర్ ర్ .."

అది వింటూనే స్వామినాథం మండిపడ్డాడు.

"బఠానీలా బొంద! మీ మీద కోపం వచ్చి పళ్ళు ఫటఫటా కొరికాను ., అంతే రేపట్నుంచి ఆఫీసుకి టైంకి రాకపో నీపని చెప్తా .. పో నువ్వింక వెళ్ళు" అన్నాడు.

రామానుజం తన సీట్లో కూర్చుని చాలా ఆలోచించాడు.

ఆఫీసుకు త్వరగా రావాలంటే ఎలా! ఈ సిటీ బస్సులు ఒక పట్టాన దొరకవు. వాటికి ఓ టైం ఉండదు. గంటల తరబడి బస్సు స్టాపులో నిలబడాలి! బస్సు ఒకవేళ వచ్చినా స్టాప్లో ఆగదు .. అందుకే రోజూ ఆఫీసుకి లేటయిపోతుంది.


ఈ సమస్యకి పరిష్కారం ఒక్కటే!

అదే—స్కూటరు కొనుక్కోవడం. స్కూటరు కొనుక్కోవడం స్కూటరుంటే ఆఫీసు టైంకి పదిహేను నిముషాల ముందు బయల్దేరితే చాలు .. రయ్యిమని టైంకి వెళ్ళిపోవచ్చు,

ఈ ఆలోచన రాగానే రామానుజం ఆఫీసులో పర్సనల్ లోను పెట్టి స్కూటరు కొనుక్కున్నాడు.

ఆ రోజు అతను మొదటిసారిగా స్కూటర్ మీద ఆఫీసుకి వెళ్తున్నాడు. స్కూటర్ స్టార్ట్ చేసి ముందుకి పోనిచ్చాడు.

మెయిన్ రోడ్డు మీదికి వచ్చీ రాంగానే రోడ్డుకి ఒక పక్కగా వెళుతున్న సైకిలిస్టు హఠాత్తుగా సైకిలు కుడిపక్కకి తిప్పి బుడుంగ్ మని రామానుజం దారికి అడ్డు తగిలాడు. రామానుజం బోల్డు కంగారుపడి సైకిలిస్టుని తప్పించడం కోసం స్కూటర్ ని తను కూడా రివ్వుమని రైట్ కి తిప్పాడు.




అంతే! అలా హఠాత్తుగా కుడిపక్కకి తిప్పడంతో ఒక రిక్షాకి గుద్దాడు.

రిక్షావాడు రామానుజం కాలర్ పట్టుకున్నాడు.

"అది కాదయ్యా, నాకు ఒక సైకిల్ వాడు అడ్డొచ్చాడు .. మరి వాడ్ని గుద్దేస్తే బాగుండదూ కదా! .. అందుకే యిట్టా ఈ పక్కకి తిప్పా

నన్నమాట! .. హి .. మరి నా చొక్కా కాలరు వదిలెయ్యాలంట!!! .. హిహి ..” అన్నాడు రామానుజం రిక్షావాడికి మస్కాకొడ్తూ.

“ఛల్ నియ్యవ్వ! ఇస్మంటి మస్కాకొట్టుడు నాతాన చెల్లది. రిక్షా రిపేర్ చేయించాలి ., యాభై రూపాయల్ తియ్ .” అన్నాడు.

రామానుజం తెల్లబోయాడు.

“రిపేర్‌కి ఇరవై రూపాయలుకంటే ఎక్కువవదు కదా! హిహి.. అంతేనా?” అన్నాడు కాలరు విడిపించుకోడానికి ప్రయత్నిస్తూ.

“ఎందుకవ్వదు! ..”

ఎన్నోగొంతులు ఒక్కసారిగా పలికాయ్.

రామానుజం ఆశ్చర్యపోయాడు. ఒక్కడే ఇన్ని గొంతులతో ఎలా పలికాడు!

“నీకు మిమిక్రీ, వెంట్రిలాక్విజమ్. లాంటివి వచ్చా! రిక్షావాడివైనా నువ్వెంత గొప్ప కళాకారుడివయ్యా ..” అన్నాడు ఆరాధనగా వాడివంక చూస్తూ.

“ఛల్ నియవ్వ . ఒక్కన్ని అనేదేంది! నీచుట్టూ సూడు మల్ల” అన్నాడు గర్వంగా.

రామానుజం బెదుర్తూ, చుట్టూ చూశాడు. వాళ్ళిద్దరి చుట్టూ దాదాపు ఇరవై మంధి రిక్షా వాళ్ళు మూగి ఉన్నారు. అందరూ కోపంగా రామానుజం వంక చూస్తున్నారు.

ఇహవాళ్ళతో లాభం లేదని రామానుజం జేబులోంచి యాభై రూపాయలు తీసి రిక్షావాడికి ఇచ్చేశాడు.

రిక్షావాడు కిసుక్కున నవ్వి జేబులో డబ్బులు వేస్కుంటూ“మల్ల రేపీ దిక్కు కెల్లి పోతావాసాబ్!” అని అడిగాడు.

“వెళ్తాను .. ఏం;” అన్నాడు రామానుజం.

“వీలుంటే మల్లి నా రిక్షాకి టక్కర్‌కొట్టు సాబ్ .. నీ కాల్మొక్త . జొంచన్ .. హిహి” అన్నాడు రిక్షావాడు.

"లేద్సార్ .. ఈయాల వాడి రిక్షాకి టక్కర్ కొట్టిండ్రు కదా .. రేపు నా రిక్షాకి టక్కర్ కొట్టుసాబ్" అన్నాడు మరో రిక్షావాడు.

"లేద్సాబ్ .. నా రిక్షాకి టక్కర్ కొట్టుసాబ్" అన్నాడు ఇంకో రిక్షావాడు.

"లేదు .. సాబ్ నా రిక్షాకే కొట్టు సాబ్."

అందరు రిక్షావాళ్ళు రామానుజాన్ని బతిమలాడసాగారు.

రామానుజం నెత్తికొట్టుకుని స్కూటర్ స్టార్ట్ చేసి కాస్తముందుకి వెళ్ళాడు. అతన్ని రైట్ నుండి లెఫ్ట్‌నుండి ఓవర్ టేక్ చేస్తూ ఆటోలు రివ్వురివ్వుమంటూ వెళ్ళసాగాయ్. వాటి ధాటికి రామానుజం భయపడి ఛావసాగాడు.

హఠాత్తుగా ఒక ఆటో రామానుజం స్కూటర్‌ని లెఫ్ట్‌నుండి ఓవర్ టేక్ చేస్తూ పక్కనుండి రాసుక్కుంది. ఆటోవాడు ఆటోని ఆపి రామానుజం కాలర్ పట్టుకున్నాడు.

"అదేంటయ్యా నువ్వేగా స్కూటర్‌ని గుద్దావ్? మళ్ళీ నన్నం టూ పేం?" అన్నాడు రామానుజం బిక్కమొహం వేస్తూ.

"నువ్వు నా దారికి అడ్డొచ్చినావ్ .. అందుకనే టక్కర్ అయ్యింది. ఆటోకి కాస్త పెయింట్ పోయింది. పెయింటేయించాల"అని రామానుజం జేబులో చెయ్యిపెట్టి ముప్పయి రూపాయలు తీసుకున్నాడు.

రామానుజం ఏడ్చుకుంటూ స్కూటర్ స్టార్ట్ చేసి కాస్త ముందు కెళ్ళాడు.

అక్కడ రోడ్డు మధ్యలో కొన్ని గేదెలు గుంపుగా నింపాదిగా నిల్చుని ఉన్నాయ్.

ఒకడు కర్రతో వాటిని అదిలిస్తూ "డుర్ .. హె .. హె .." అంటున్నాడు.

రామానుజం స్కూటరాపి విసుగ్గా అతనివంక చూశాడు.

"ఏంటయ్యా నడి రోడ్డుమీదికి గేదెల్ని తోలుకొచ్చావ్? వాటిని త్వరగా తియ్ .." అన్నాడు.

అతను రామానుజం వంక కోపంగా చూశాడు. "ఏంటి? నేను గేదెలు తోలుకునే వాడ్లా కనిపిస్తున్నానా? అదిగో..ఆ పక్కనున్న మారుతీ కారు నాదే .. ఇంతసేపూ గేదెల్ని నేను తోలాను .. ఇప్పుడు నీ వంతు" అని కర్ర రామానుజం చేతికి ఇచ్చాడు.

"డుర్ర్ .. హె .. హె .. హై అంటూ వాటిని తోలి రోడ్డు క్లియర్ చేసి అప్పుడు రామానుజం స్కూటర్ ఎక్కాడు.

కాస్త దూరం వెళ్ళాక అటు ఒక కిలోమీటరు ఇటు ఒక కిలోమీటరు దాకా ట్రాఫిక్ జామ్ అయిపోయింది. దాన్ని క్లియర్ చేయడానికి ట్రాఫిక్ పోలీసులకి అరగంట పట్టింది.

హమ్మయ్య అని తేలికగా వూపిరి పీల్చుకొని స్కూటర్ని ముందుకి పరుగెత్తించాడు రామానుజం.

ఆపీసు దగ్గర పడ్తుండగా రోడ్డు మధ్యలో ఉన్న పెద్ద గొయ్యిలోంచి చూసుకోకుండా స్కూటర్ నడిపి ఢామ్మని పడిపోయాడు రామానుజం.

మట్టికొట్టుకుపోయిన బట్టల్తో, రేగిన జుట్టుతో రామానుజం ఆపీసరు స్వామినాథం గదిలోకి అడుగుపెట్టాడు.

"ఏంటి ఈవాళ ఆపీసుకి రెండు గంటలు లేటుగా వచ్చావ్? ఈ వేళం కుంటిసాకు చెప్పదల్చుకున్నావ్?" పళ్ళుకొరుకుతూ రామానుజాన్ని అడిగాడు స్వామినాథం.

"ఈవేళ స్కూటర్ మీద వచ్చాను సార్ .. " నీరసంగా జవాబు చెప్పాడు రామానుజం.